TGTEL/26/A4985

ఆదాబ్ సైబరాబాద్

తెలుగు దినపత్రిక

ADAAB CYBERABAD DAILY NEWS PAPER

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

PUBLISHED FROM : HYDERABAD-MEDCHEL MALKAJGIRI-RANGAREDDY

ఎడిటర్ : బిఎస్ శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 96 | గురువారం, అక్టోబర్ 22, 2026 , | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 96 | 22-10-2026 (THURSDAY) | PAGES: 4 | RS : 5/-

పోలీస్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి

అనుమతి ఇచ్చాం

- అమరవీరులకు నివాళులర్పించిన సీఎం

హైదరాబాద్ : ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నివాళులర్పించింది. వారి కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల కుటుంబా లకు అందించే పరిహారాన్ని భారీగా పెంచామని వెల్లడించా రు. 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో మహిళా భద్రత, డ్రగ్స్ గంజాయి సైబర్ నేరాల కట్టడి, కల్తీ ఆహారంపై ప్రభుత్వ చర్యలపై సీఎం వివరాలు వెల్లడించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ స్మారక పరేడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం వారి సేవలను స్మరించుకుంటూ రూపొందించిన 'అమరులు వారు' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అమరులకు నివాళి అర్పించిన అనంతరం ప్రసంగించిన సీఎం, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం భావోద్వేగంతో కూడిన రోజని పేర్కొన్నారు. సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను మరువలేమన్నారు. అమరుల కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేరని అయితే వారి కుటుంబాలు ఒంటరివి కావని, తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ, సమాజం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు కోటి రూపాయలు, ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు కోటి 25 లక్షలు, డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు కోటి 50 లక్షల రూపాయలు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయల పరిహారం అందించేలా నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని సీఎం స్పష్టం చేశారు. హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను పది లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత ముఖ్యమని సీఎం పేర్కొన్నారు. పోలీస్ శాఖను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తెలంగాణకు బీసీ సీఎం..

కానీ ఇప్పుడే కాదు

- బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్
- రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొనసాగుతుందని విశ్వాసం
- కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య

హైదరాబాద్ : తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు.

ఆ 5 గంటలు విద్యుత్

వినియోగం తగ్గించండి!

హైదరాబాద్: ఎల్‌నినో కారణంగా తెలంగాణలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిపోతోంది. ఉష్ణోగ్రతలు, ఉక్కపోతను తట్టుకునేందుకు ప్రజలు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు విపరీతం గా వాడుతున్నారు. అయితే ఒకపక్క వ్యవసాయానికి, మరోపక్క తపరిశ్రమలు, గృహ అవసరాలను సమన్వయం చేసుకుంటూ విద్యుత్ సరఫరా చేస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్? వీ పాటిల్ తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో వినియోగదారులు విద్యుత్‌ను ఎలా పొదుపుగా వినియోగి ంచాలో ఆయన వివరించారు.

తాగునీటి కోసం వెయ్యి క్యూసెక్కుల

నీటి విడుదల

పాలమూరు: పాలమూరు-రంగారెడ్డి-నార్లాపూర్ నుంచి ఎల్లూరు జలాశయానికి మంత్రి జూపల్లి కృష్ణారావు నీరు విడుదల చేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 ఏళ్లు కాలయాపన చేసి మతి లేకుండా మాట్లాడుతున్నారని, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు నీటిని ముందుకు తీసుకెళ్లండంటూ బీఆర్ఎస్ నేతలకు జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని మిషన్ భగీరథ అదనంగా " రా" వాటర్ పంపింగ్ సిస్టంను మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. మిషన్ భగీరథ, పీఆర్ఎల్ఐ, ఎంజీకెఎల్ఐ ప్రాజెక్టుల అధికారులతో సమీక్షలు నిర్వహించారు.

ఏపీలో 19 మున్సిపాలిటీల

ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

- నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారంటూ వైసీపీ పిటిషన్
- అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను నిలిపివేయాలని సుప్రీం ఉత్తర్వులు
- సుప్రీంకోర్టు సూచనలతో ఎస్ఈసీ కీలక నిర్ణయం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 19 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాసేపటి క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ నిలిచిపోయాయి. రాష్ట్రంలో అధికార పక్షం వేధింపుల కారణంగా పలు ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, వారిని అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని, గడువు పొడిగించి తగిన రక్షణ కల్పించాలని పిటిషన్‌లో కోరింది.

'జాతీయ భద్రతను పరిరక్షించడంలో

కేంద్రం విఫలం'

- మణిపుర్ హింసాకాండపై కాంగ్రెస్
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

మణిపుర్: మణిపుర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో, రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంలో, జాతీయ భద్రతను రక్షించడంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇటీవల నలుగురు అమాయక పౌరులు హత్యకు గురికావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మే 2023 నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 24,530 మంది సహాయక శిబిరాల్లో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకున్న చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మళ్లీ రక్తసిక్తమైన మణిపుర్(మణిపుర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండలో నలుగురు అమాయక పౌరులు దారుణంగా హత్యకు గురికావడాన్ని ఖర్గే ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

2029 డిసెంబర్ 31 నాటికి

భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మార్చమే మా లక్ష్యం

దిల్లీ: 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని అమిత్ షా పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల భవిష్యత్ తరాలు నాశనం కావడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని తెలిపారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థలకు కూడా డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా ఆర్థిక సాయం అందుతోందని పేర్కొన్నారు. దిల్లీలో బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్‌లో

దుర్గామాత నిమజ్జనాలు

- నగరవ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 21: నగరంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఆంక్షలు విధించారు. పలు ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌నుదారిమళ్లిస్తున్నారు. పీపుల్స ప్లాజా, గార్డెన్ పాయింట్, జలవిహార్, సంజీవయ్య పార్క్ బేబీ పాండ్స్ వద్ద విగ్రహాల నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో పంజాగుట్ట, రాజ్‌భవన్ వైపు నుంచి ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌కు వచ్చే వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లిస్తున్నారు. వి.వి. విగ్రహం వద్ద ట్రాఫిక్‌ను నిరంకారి జంక్షన్ వైపు పంపిస్తున్నారు. ఇక్బాల్ మినార్ వైపు సాధారణ వాహనాలకు అనుమతి నిరాకరించారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాల వాహనాలకు మాత్రమే అనుమతి కల్పిస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్ సైఫాబాద్ వద్ద వాహనాలను రవీంద్ర భారతి, మాసాబ్‌ట్యాంక్ వైపు మళ్లిస్తున్నారు. ఖైరతాబాద్ బడా గణేశ్ లేన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అప్పర్ ట్యాంక్‌బండ్ నుంచి వచ్చే వాహనాలను లిబర్టీ వైపు మళ్లిస్తున్నారు.

'రప్పా రప్పా' అంటూ

రౌడీయిజం చేస్తే సహించం

- శాంతిభద్రతల్లో ఏపీ ఆదర్శంగా నిలవాలి : సీఎం చంద్రబాబు
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజకీయ ముసుగులో అరాచకాలు, రౌడీయిజం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని, అదే సమయంలో బాధితులకు పూర్తి భరోసా లభించాలని ఆయన ఆకాంక్షించారు. మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో నేడు నిర్వహించిన 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర పోలీసులకు ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ంద్రబాబు మాట్లాడుతూ.. "ఖాకీ అంటే బాధ్యత, పోలీసు అంటే భరోసా. ప్రమాదం జరిగినా, నేరం జరిగినా ప్రజలకు మొదటగా గుర్తొచ్చేది పోలీసులే. ప్రజలు పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడానికి పోలీసులు తమ కుటుంబ సంతోషాలను త్యాగం చేస్తున్నారు" అని అన్నారు.

ఇండియా కూటమి తప్పుడు ప్రచారాన్ని

తిప్పికొడతాం

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి కలిసి దేశవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తూ, నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా వారి చర్యలు ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ ప్రయోజనాల కంటే అధికారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన

అభ్యర్థి ఖరారు

వరంగల్ జిల్లా: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని ఖరారు చేసింది. దసరా పర్వది నాన్ని పురస్కరించుకుని డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను తమ అభ్యర్థిగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. గ్రాడ్యుయే ట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీకాంత్ గౌడ్ పేరు ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు, ఈ ఎన్నికల దృష్ట్యా వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులను లక్ష్యంగా చేసుకుని ఎన్నికల కార్యాచరణను కవిత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

గురువారం,
అక్టోబర్ 22, 2026

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD

వెంకటేశ్వర కాలనీలో యూజీడీ పనులు ప్రారంభం

డివిజన్ అభివృద్ధే ధ్యేయం: మల్లెపూల శ్రీకాంత్ యాదవ్

అదాబ్ సైబరాబాద్, చంద్రపురి కాలనీ: జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చంద్రపురి కాలనీ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో భూగర్భ మురుగునీటి పారుదల (యూజీడీ) పనులను డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, జోగి సునీత, సీనియర్ నాయకులు రజిత గోపాల్, నర్ర మహేష్, భాస్కర్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ గౌస్, స్థానికులు బషీర్, షఫీ, శ్రీరామ్, నాగరాజు, శ్రీనివాస్, స్రవంతి, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి మల్లారెడ్డికి విజయదశమి శుభాకాంక్షలు

అదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్: దసరా పండుగ సందర్భంగా జవహర్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాషవోని కొండల్ ముదిరాజ్, మాజీ మేయర్ మేకల కావ్య, అల్లూరి రాజశేఖర్ తదితరులు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భార్గవ్ రామ్, పల్లపు రవి, జిట్టే శ్రీనివాస్, ఆలూరి సంగీత రాజశేఖర్, రాంచందర్, విక్రమ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

దోమలో ఘనంగా విజయదశమి వేడుకలు.

జమ్మి చెట్టుకు పూజలు చేసిన మాజీ సర్పంచ్ కె. రాజిరెడ్డి.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి మహిషాసురుడిపై దుర్గాదేవి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటారని దోమ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కె. రాజిరెడ్డి గుర్తుచేశారు. మంగళవారం విజయదశమి సందర్భంగా వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలో నిర్వహించిన జమ్మి పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మయ్య, గోపాల్ గౌడ్, రాజగోపాల్ చారితో పాటు పంచాయతీ సభ్యులతో కలిసి రాజిరెడ్డి జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా జమ్మి కొమ్మను కోసి పూజలు చేశారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గ్రామస్తులు పండుగ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

విజయదశమి సందర్భంగా ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి జమ్మి పూజలు.

శివరెడ్డిపల్లిలో సంప్రదాయబద్ధంగా దసరా వేడుకలు..
ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డా. టి. రామ్మోహన్ రెడ్డి తన స్వగ్రామమైన వికారాబాద్ జిల్లా దోమ మండలం శివరెడ్డిపల్లిలో సంప్రదాయ బద్ధంగా జమ్మి పూజలు నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొని విజయదశమి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం వేడుకల్లో భాగంగా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి గ్రామ ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ప్రజల జీవితాల్లో నూతన ఆశలు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని కోరుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగను ప్రజలంతా ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్‌లోకి పలువురు నాయకులు.

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరికలు.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. పూడూరు మండల పరిధిలోని చెంగోముల్/బర్లపల్లి గ్రామాలకు చెందిన పలువురు మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులకు కొప్పుల మహేష్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలంపల్లి బోనమ్మ గుడి వద్ద రూ.65 లక్షలతో సీసీ రోడ్డు, హైమాస్ట్ లైట్లు ప్రారంభం

వికారాబాద్ అభివృద్ధికి పెద్దపీట.. అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
దసరా పండుగ వేళ రోడ్డు, లైట్ల ప్రారంభంతో స్థానికుల్లో హర్షం

ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా : వికారాబాద్ పట్టణ అభివృద్ధిలో భాగంగా అలంపల్లి బోనమ్మ గుడి వద్ద రూ.65 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డుతో పాటు హైమాస్ట్ లైట్లను తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ విజయదశమి సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. దసరా పండుగ రోజున నూతన రహదారిని, హైమాస్ట్ లైట్లను అందుబాటులోకి తీసుకురావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. వికారాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.
వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి, దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.
అలంపల్లి బోనమ్మ గుడి వద్ద సీసీ రోడ్డు నిర్మాణం, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వల్ల స్థానికులకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు రాత్రివేళల్లో వెలుతురు, భద్రత మెరుగుపడనున్నాయి. పండుగ సందర్భంగా ఈ పనులను ప్రారంభించడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథం సత్యనారాయణ గుప్త, కౌన్సిలర్లు విశ్వనాథం రాఘవేందర్ గుప్త, దుర్గం మల్లికార్జున్ గౌడ్, విజయలక్ష్మి నాగరాజ్, చిగుళ్లపల్లి రమేష్, లక్ష్మీకాంత్ రెడ్డి, వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, వికారాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డి, డీఎస్పీ ఆంజనేయులు, సీఐ రఘు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబెడ్కర్ విగ్రహం చూపుడు వేలు ధ్వంసం.!

జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు
విగ్రహం కనిపించకుండా చేసి అవమానించారని ఆరోపించిన
మాలమహనాడు జిల్లా అధ్యక్షుడు గోపాస్ రవీందర్

ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : గాజులరామరం చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం చూపుడు వేలు విరిగిపోవడంపై జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు నమోదైంది. ఫ్లెక్సీ కట్టే సమయంలో విగ్రహం చూపుడు వేలు ధ్వంసం చేయడంతోపాటు, విగ్రహం కనిపించకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి అంబేద్కర్‌ను అవమానించారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గోపాస్ రవీందర్ ఆరోపించారు. ఈ ఘటనపై ఆయన జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి నష్టం కలిగించిన వారిపై విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మోత్కూర్‌లో ఘనంగా విజయదశమి వేడుకలు.

ఐకమత్యం, సోదరభావంతో దసరా శుభాకాంక్షలు తెలిపిన గ్రామస్థులు.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకుని గ్రామస్థులు ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ఒకచోట చేరి పరస్పరం దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ పండుగ ప్రజల్లో ధైర్యం, నమ్మకం, సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య స్నేహసంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ఐకమత్యం, సోదరభావం, సంప్రదాయాలను కాపాడేందుకు దోహదపడతాయని తెలిపారు. గ్రామ ప్రజలంతా కలిసి పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నిండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో కృషి చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ విజయదశమి వేడుకల్లో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జమ్మిచెట్టుకి ఎందుకంత ప్రాధాన్యత..!?

ఆదాబ్ సైబరాబాద్,ములుగు, దసరా సంబరాలు చివరిరోజుకి చేరుకోగానే అందరికీ గుర్తుకువచ్చేది జమ్మిచెట్టు. దసరా సాయంత్రం వేళ జమ్మిచెట్టుని కొట్టి, ఆ చెట్టు ఆకులను బంగారంగా భావిస్తూ పెద్దల చేతిలో పెట్టి ఆశీస్సులు తీసుకుంటారు. చెట్లని దైవంగా పూజించి కొలుచుకోవడం హైందవ సంస్కృతిలో తరచూ కనిపిస్తుంది. కానీ ఈ దసరా రోజుకూ, జమ్మి చెట్టుకీ మధ్య అనుబంధాన్ని వివరించే సందర్భాలు చాలానే ఉన్నాయి.

జమ్మి గురించి...!

జమ్మిచెట్టు భారతీయులకు కొత్తేమీ కాదు. ఇంకా చెప్పాలంటే భారత ఉపఖండంలోనే ఈ వృక్షం ఉద్భవించిందన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం. అందుకనే ఋగ్వేదకాలం నుంచే జమ్మి ప్రస్తావన కనిపిస్తుంది. అప్పట్లో ఈ చెట్టుని అగ్నిని పుట్టించే సాధనంగా వాడేవారు. మనం పురాణాలలోనూ, వేదాలలోనూ తరచూ వినే 'అరణి'ని ఈ జమ్మితోనే రూపొందించేవారు. జమ్మి ఎలాంటి ప్రాంతాలలో అయినా త్వరత్వరగా పెరిగేస్తుంది.
నీటి లభ్యత పెద్దగా లేకున్నా కూడా సుదీర్ఘకాలం బతికేస్తుంది. అందుకే ఎడారి ప్రాంతమైన రాజస్థాన్ మొదలుకొని వర్షపాతం తక్కువగా ఉండే తెలంగాణ వరకు పొడి ప్రాంతాలలోని ప్రజలకు జమ్మి జీవనాధారంగా నిలుస్తోంది. పట్నం వాసులకు జమ్మి ప్రయోజనాల గురించి పెద్దగా తెలియకపోవచ్చు. కానీ రైతులకు, గ్రామీణ ప్రాంతాలవారికీ జమ్మి అంటే ప్రాణం. దీని కొమ్మలు, ఆకులు పశువులకు మేతగా ఉపయోగపడతాయి; దీని వేళ్లు భూసారాన్ని పట్టి ఉంచుతాయి. ఈ చెట్టులోని ప్రతిభాగాన్నీ నాటువైద్యంలో ఔషధాలుగా వాడతారు. ఈ చెట్టు నుంచి వచ్చే గాలిని పీల్చినా, దీని చుట్టూ ప్రదక్షిణాలు చేసినా ఆరోగ్యం సమకూరుతుందని పెద్దల నమ్మకం. అందుకే వినాయక చవితికి పూజించే ఏకవింశతి పత్రాలలో శమీ పత్రాన్ని కూడా చేర్చారు.

దసరా– జమ్మిచెట్టు...!

ఏడాదిపాటు అజ్ఞాతవాసానికి బయల్దేరిన పాండవులు విజయదశమి రోజునే తమ ఆయుధాలను జమ్మి చెట్టు మీద దాచి వెళ్లారట. తిరిగి అదే విజయదశమినాడు వారు జమ్మిచెట్టు రూపంలో ఉన్న అపరాజితా దేవిని పూజించి, తమ ఆయుధాలను తీసుకున్నారు. అలా పాండవులకు అపరాజితా దేవి ఆశీస్సులు ఉండబట్టే, వారు యుద్ధంలో గెలిచారని నమ్ముతారు. కేవలం



పాండవులే కాదు, రామునికి సైతం జమ్మిచెట్టు ప్రీతికరమైనది చెబుతారు (రామస్య ప్రియదర్శనీ). పైగా జమ్మిచెట్టుని స్త్రీ స్వరూపంగా (శక్తిగా) భావిస్తారు. ఆ శక్తి అనుగ్రహం కూడా రాములవారికి లభించబట్టే, ఆయన రావణునితో జరిగిన సంగ్రామంలో గెలుపొందారట. జమ్మి చెట్టుకి మన పురాణాలలోనూ, జీవితాలలోనూ ఇంతటి అనుబంధాన్ని కలిగి ఉండబట్టే దసరా రోజున జమ్మిచెట్టుకి పూజలు చేస్తారు. శమీవృక్షానికి ప్రదక్షిణలు చేస్తూ ఈ క్రింది శ్లోకాలను పఠిస్తారు. "శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశనీ, అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియవాదినీ." "శమీ శమయతే పాపం శమీలోహిత కంటకా, ధారిణ్యర్జున బాణానాం రామస్య ప్రియవాదినీ, కరిష్యమాణ యాత్రాయాం యథాకాలం సుఖంమయా, తత్ర నిర్విఘ్న కర్త్రీత్వం భవ శ్రీరామపూజితే."

జమ్మి బంగారం...!

పూజ ముగిసిన తరువాత జమ్మి ఆకులను తుంచుకుని వాటిని బంగారంలా భద్రంగా ఇళ్లకు తీసుకువెళ్తారు. ఆ ఆకులను తమ పెద్దల చేతిలో ఉంచి వారి ఆశీర్వాదాన్ని తీసుకుంటారు.
జమ్మి ఆకులకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యత రీత్యా అవి బంగారంతో సమానం అనడంలో ఏమాత్రం సందేహం లేదు. పైగా కుబేరుడు ఒకనాడు రఘుమహారాజుకి భయపడి జమ్మిచెట్లున్న తావున బంగారాన్ని కురిపించాడనే గాథ ఎలాగూ ప్రచారంలో ఉంది. అలాంటి జమ్మి ఆకులను శుభంగా భావించి, జమ్మి కొట్టేందుకు రాలేకపోయిన పెద్దల చేతిలో ఉంచుతారు. జమ్మిని పూజించడం అంటే జీవితంలో సకల విజయాలనూ సాధించాలని కోరుకోవడమే. పిల్లల మనసులోని ఈ విజయకాంక్షను గ్రహించిన పెద్దలు, వారి మనోకామన నెరవేరాలని తమ దీవెనలను కూడా జతచేస్తారు.

పాలపిట్ట...!

దసరా రోజున పాలపిట్టను కూడా చూడాలన్న నియమం ఒకటి ఉంది. పాండవులు తమ ఆయుధాలను జమ్మిచెట్టు మీద నుంచి తీసుకుని తిరిగి తమ రాజ్యానికి చేరుకుంటుండగా, వారికి పాలపిట్ట కనిపించిందనీ,
అప్పటి నుంచీ వారికి సకల విజయాలూ సిద్ధించాయని ఒక నమ్మకం. అందుకనే విజయానికి శుభసూచకంగా పాలపిట్టను దర్శించే ఆనవాయితీ బయల్దేరింది.

కొసమెరుపు:

జమ్మిచెట్టుకి ఉన్న ప్రాముఖ్యతను శాస్త్రీయంగా గుర్తిస్తూ 'యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్' (ఖూజు) భూసారాన్ని పెంచేందుకు ప్రతి ఇంట్లోనూ ఒక జమ్మిచెట్టుని నాటమని సూచిస్తోంది. కానీ మనదగ్గర మాత్రం ఉన్న కాసిని జమ్మి చెట్లూ నాశనం అయిపోతున్నాయి.
ఇప్పటి పిల్లలైతే జమ్మి చెట్టుని గుర్తిస్తారో లేదో కూడా అనుమానమే! ఇక పాలపిట్ట సంగతి చెప్పనే అక్కర్లేదు. విజయదశమినాడు పంజరాల్లో పాలపిట్టలను తీసుకుని వచ్చి దర్శనం చేయిస్తున్నారంటే...
ఇవి అంతరించిపోయేందుకు ఎంతటి సమీపంలో ఉన్నాయో తెలిసిపోతుంది. జమ్మిచెట్టు, పాలపిట్ట తిరిగి మన జీవితాలలో భాగమైనప్పుడే అసలైన విజయదశమి!

కుసుమసముద్రంలో ఘనంగా విజయదశమి వేడుకలు

గ్రామ ప్రజల సుఖసంతోషాలు, అభివృద్ధి కోసం సర్పంచ్ గందె ప్రవీణ్ కుమార్ ప్రత్యేక పూజలు.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి.విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం కుసుమసముద్రం గ్రామంలో వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద గ్రామ సర్పంచ్ గందె ప్రవీణ్ కుమార్ విజయ పతాకాన్ని ఆవిష్కరించి, జమ్మి చెట్టుకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ప్రజలందరూ చేపట్టే ప్రతి పనిలో విజయం సాధించాలని, గ్రామంలో సుఖశాంతులు, ఐకమత్యం వెల్లివిరియాలని ప్రార్థించారు.విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, జమ్మి పూజకు మన సంప్రదాయాల్లో విశిష్ట స్థానం ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగుతూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొని విజయదశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.ం

మోత్కూర్ గ్రామంలో వైభవంగా దుర్గామాత నిమజ్జనోత్సవం

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి వీడ్కోలు.
ఆటపాటలతో మార్మోగిన గ్రామం.

వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూర్ గ్రామంలో దుర్గామాత నిమజ్జనోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ వేడుకల్లో యువకులు గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు.నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గామాతను నిమజ్జనం చేసేందుకు భక్తులు ఉత్సాహంగా తరలివచ్చారు. మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు ఆటపాటలు, భక్తిగీతాలు, అమ్మవారి నామస్మరణతో సందడి చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామస్థులంతా ఐకమత్యంతో నిమజ్జనోత్సవంలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దుర్గామాత ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

కొండాయపల్లి లో ఘనంగా విజయదశమి వేడుకలు.

గ్రామ సర్పంచ్ నెత్తి, ఆనంద వెంకటయ్య ఆధ్వర్యంలో.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా దోమ మండలం కొండాయపల్లి గ్రామంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ , ఆనంద వెంకటయ్య జమ్మి చెట్టుకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలు చేపట్టే ప్రతి పనిలో విజయం సాధించాలని, గ్రామంలో సుఖశాంతులు, ఐకమత్యం వెల్లివిరియాలని ప్రార్థించినట్లు తెలిపారు.విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, జమ్మి పూజకు మన సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగుతూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజాప్రతినిధులు, నిమ్మల, ఆశమ్మ, పూజ, నరేష్, లక్ష్మణ్ గ్రామస్థులు తదితరులు పాల్గొని భక్తిశ్రద్ధలతో విజయదశమి వేడుకలను జరుపుకున్నారు.

టీ.ఆర్.ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా షేక్ హుస్సేన్ నియామకం.

ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం :తెలంగాణ ఉద్యమకారుడు, యువ నాయకుడు షేక్ హుస్సేన్ ను ఖమ్మం జిల్లా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు నియామించడం జరిగింది. ఖమ్మం జిల్లా ఉద్యమాల్లో కీలకంగా పనిచేసిన హుస్సేన్ మొదటి నుంచి కవిత అనుచరుడుగా కొనసాగుతున్నారు. ఖమ్మం జిల్లాలో కల్వకుంట్ల కవిత కు నమ్మకమైన వ్యక్తిగా ఉన్న, హుస్సేన్ స్వస్థలం ఖమ్మం జిల్లా, తల్లాడ మండలం, కుర్నవల్లి గ్రామం, ఖమ్మం జిల్లాలో తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు ఎన్నో సభలు సమావేశాలు నిర్వహించి, సరిహద్దు ప్రాంతమైన ఖమ్మం జిల్లాలో ఈ ప్రాంత ప్రజల్లో చైతన్యం నింపి తెలంగాణ ఉద్యమాన్ని కీలకంగా ముందుకు తీసుకెళ్లడంలో ఎన్నో పాత్ర చాలా కీలకమని చెప్పుకోవచ్చు, తనను నమ్మి ఇంత పెద్ద బాధ్యతను తన మీద పెట్టినందుకు కల్వకుంట్ల కవిత కి తాను రుణపడి ఉంటానని, ఖమ్మం జిల్లా ప్రజల కష్టసుఖాల్లో తోడుంటానని ప్రజా సమస్యలపై పోరాడుతానని ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన తెలియజేసారు.

ఇబ్రహీంపల్లి లో అంగరంగ వైభవంగా విజయదశమి వేడుకలు

-వార్డులో మొట్టమొదటిసారిగా దుర్గామాత కొలువుదీరింది
-చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా
-వార్డు ప్రజలంతా క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నాం
-ఆనందంగా అలైయ్ - బలైయ్ కార్యక్రమం
-వార్డులోని ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపిన కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్ రెడ్డి

ఆదాబ్ సైబరాబాద్ చేవెళ్ల..రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ 11 వ వార్డు ఇబ్రహీంపల్లి లో అంగరంగ వైభవంగా విజయదశమి (దసరా పండుగ) వేడుకలు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేము కౌన్సిలర్ గా గెలుపొందిన మొదటి సంవత్సరంలోనే వార్డులో మొట్టమొదటిసారిగా దుర్గామాత కొలువుదీరడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. వార్డులోని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, నియమ నిష్ఠలతో నవ రాత్రులపాటు బ్రాహ్మణులచే అమ్మవారికి అన్ని విధాలుగా వేదమంత్రాలతో పూజలు జరిపించడం జరిగిందని, చిన్నారులు, మహిళలంతా కలిసి బతుకమ్మ, దుర్గామాత పాటలతో కోలాటాలు ఆడుతూ చూడముచ్చటగా ఈ కార్యక్రమం కొనసాగిందన్నారు. అశ్వయుజ శుద్ధ దశమినాడే శ్రీరాముడు పది తలల రావణాసురుడిని సంహరించాడు కాబట్టి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ దసరా పండుగను జరుపుకుంటారని అన్నారు. దసరా అనే పదం సంస్కృతంలో దశ - హర (పది తలల ఓటమి- పది చెడుల నాశనం) నుండి వచ్చిందని, ఈ గొప్ప విజయానికి గుర్తుగానే అనేక సంవత్సరాల నుండి శుద్ధ దశమినాడు ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. అనంతరం చేవెళ్లలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పుష్కరిణి (గుండం)లో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేసామని అన్నారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇబ్బందులకు గురికాకుండా ఈ పండుగను నిర్వహించిన వార్డు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వార్డులోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకుండా ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలని, రాష్ట్రం మరియు దేశంలో ఎల్ నినో (జుక్కీ చీఱజశీ)సమస్య తొలగిపోవాలని సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల నుండి మొదలుకొని ప్రతి ఒక్కరి కళ్ళల్లో ఆనందం చూడాలని మేము మనస్ఫూర్తిగా మా వార్డులో కొలువుదీరిన దుర్గామాతను వేడుకున్నామని అన్నారు. వార్డులోని పెద్దలతో మరియు ప్రజలతో కలిసి జమ్మి పూజ నిర్వహించి అలైయ్ - బలైయ్ కార్యక్రమం ఆనందంగా జరుపుకున్నామని తెలిపారు.

ఆదివాసుల సమస్యలను పట్టించుకోని ఐటీడీఏ పీఓ ఏటూరు నాగారం గిరిజనుల గోడు వినేదెవరు?

ములుగు జిల్లా కార్యదర్శి పాయం కోటేశ్వరరావు
ఆదివాసుల సమస్యల పరిష్కారంలో ఐటీడీఏ అధికారులు చొరవ చూపాలి

ఆదాబ్ సైబరాబాద్,ములుగు,ఆదివాసుల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేయాల్సిన ఐటీడీఏ అధికారులు గిరిజనుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదివాసీ ప్రజలు కోరుతున్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, ఉపాధి, భూముల సమస్యలు సహా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులకు సకాలంలో న్యాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అనే అంశంపై సమీక్ష అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం ఆలస్యమవుతోందనే ఫిర్యాదులు ఉంటే, వాటిపై ఐటీడీఏ పీఓ ప్రత్యేకంగా స్పందించాలని కోరుతున్నారు.
గిరిజన ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించడం, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించడం ద్వారా ప్రజలకు ఉపశమనం కలిగించవచ్చని స్థానికులు సూచిస్తున్నారు.ఇప్పటికైనా ఐటీడీఏ పీఓ స్పందించి ఆదివాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. గిరిజనుల సంక్షేమం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అమలయ్యేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదివాసీ ప్రజలు కోరుతున్నారు.

సీఎం కొడంగల్ పర్యటనకు పటిష్ట పోలీస్ బందోబస్తు

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా
ట్రాఫిక్ నియంత్రణ, శాఖల మధ్య సమన్వయంపై అధికారులకు దిశానిర్దేశం

ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 22న కొడంగల్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీస్ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పోలీస్ అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బుధవారం కొడంగల్‌లోని హెలిప్యాడ్‌తో పాటు పర్యటన ప్రాంతాలను జిల్లా ఎస్పీ పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం ఇంటెలిజెన్స్ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా చర్యలు, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై చర్చించారు.
ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పర్యటన మార్గాలు, ఇతర కీలక ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ తమకు కేటాయించిన ప్రాంతాల్లో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.
జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవసరమైన వైద్య సిబ్బందితో రెండు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విద్యుత్, మున్సిపల్, ఆహార భద్రత, అగ్నిమాపక, రహదారులు--భవనాల శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.
ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్పీ శ్రీనివాస్, పోలీస్ శాఖకు చెందిన సీఐలు, ఎస్ఐలు, రహదారులు--భవనాల శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.
పోలీస్ సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్
సమావేశం అనంతరం కొడంగల్‌లోని బాసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా విధులు, సిబ్బందికి కేటాయించిన బాధ్యతలు, విధుల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, పరస్పర సమన్వయం, అప్రమత్తతపై దిశానిర్దేశం చేశారు.ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- అమరుల సేవలు ప్రతి పోలీసుకు స్ఫూర్తిదాయకం: ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- భూపాలపల్లిలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- అమరులకు నివాళులర్పించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ
- స్మృతి పరేడ్, రక్తదాన శిబిరం నిర్వహణ

భూపాలపల్లి, అక్టోబర్ 21
దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరై అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ నేతృత్వంలో స్మృతి పరేడ్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 155 మంది పోలీసు అమరవీరుల పేర్లను అదనపు ఎస్పీ నరేష్ కుమార్ చదివి వినిపించారు. అనంతరం అమరులకు గౌరవ వందనం సమర్పించి పుష్పాంజలి ఘటించారు.

అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం: ఎస్పీ
ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది మరింత అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం: కలెక్టర్
జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల సేవలు ఎంతో కీలకమన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, వారి స్ఫూర్తితో తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి: ఎమ్మెల్యే
భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొని యాడారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశ యాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అమరుల కుటుంబాలకు భరోసా
సంస్మరణ కార్యక్రమానికి హాజరైన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసు శాఖ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

రక్తదాన శిబిరం ప్రారంభం
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రారంభించారు. అమరవీరుల సేవా స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పోలీసులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, రెహమాన్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, పోలీసు సంఘం అధ్యక్షుడు నరేష్, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనగామ బతుకమ్మ కుంటలో దుర్గాదేవి నిమజ్జనం

జనగామ : జనగామ పట్టణంలోని బతుకమ్మ కుంటలో దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు భక్తిపారవశ్యంతో దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల జైజయధ్వానాలతో నిమజ్జన ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. దుర్గాదేవికి వీడ్కోలు పలుకుతూ భక్తులు ఘనంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో భక్తులు అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు.

ఉర్సులో వైభవంగా దసరా వేడుకలు

రంగలీల మైదానంలో ఘనంగా రావణవధ

వరంగల్ : విజయదశమి సందర్భంగా వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉర్సు దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రావణవధ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండా సురేఖ, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు రావణుడి ప్రతిమకు నిప్పంటించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక అని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, రావణవధను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సంప్రదాయబద్ధంగా జరిగిన వేడుకలు నగరవాసులను ఆకట్టుకున్నాయి.

గుండ్ల సింగారంలో ఘనంగా బొడ్రాయి వేడుకలు

- బాలాజీ బంజారా కాలనీలో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు
- గ్రామ శ్రేయస్సు కోసం యాటపోతు, సొరకాయ సమర్పణ
- వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ లావుడియా అనూష రవి నాయక్

హనుమకొండ, అక్టోబర్ 21
హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం బాలాజీ బంజారా కాలనీలో గ్రామ బొడ్రాయి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల ఆధ్వర్యంలో తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను అనుసరిస్తూ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సంప్రదాయంలో భాగంగా మాజీ కార్పొరేటర్ లావుడియా అనూష రవి నాయక్ యాటపోతును బలి ఇవ్వగా, భూక్య కమల హరి సింగ్ నాయక్ సొరకాయను కోసి సమర్పించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను కొనసాగించడం ద్వారా గ్రామంలో ఐకమత్యం, సోదరభావం పెంపొందుతాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లావుడియా పల్లవి రాజు నాయక్, హనుమంతు నాయక్, హరిలాల్ నాయక్, మంజీ నాయక్, కిషన్ నాయక్, తారాచంద్ నాయక్, రాజు చిన్న, సత్తయ్య నాయక్, మూడు రామ్ చందర్ నాయక్, దేవ్ సింగ్ నాయక్, రాజేందర్ బోడ, పులి రాజు, జెట్ మాల్ నాయక్, వెంకన్న నాయక్, కిషన్, శంకర్, శ్రీనివాస్, ప్రతాప్, కళ్యాణ్, రమేష్, ప్రమోద్, లోకేష్, తిరుపతి, ఈశ్వర్, బిక్షపతి, అరుణ్, రవి, అరవింద్, విజయ్, మురళి, రవినాథ్, వెంకట్, కిరణ్, కిషోర్, యాకూబ్, ప్రసాద్, వినోద్, సైదులు, సుమన్, మోహన్ నాయక్, వెంకటేష్, రాజేందర్, రవీందర్, సునీల్, శ్రీను, సుశాంత్, పవన్ కుమార్, రంగన్న, మున్నా తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా నిర్వహించిన ఈ వేడుకలు బంజారా కాలనీలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. సంప్రదాయాల పరిరక్షణతోపాటు గ్రామ ప్రజల మధ్య ఐక్యతకు ఈ కార్యక్రమం ప్రతీకగా నిలిచింది.

పోలీసు అమరులకు ఘన నివాళి

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం: సీపీ ఎన్. శ్వేత

హనుమకొండ : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరులకు ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు తదితరులు అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీపీ ఎన్. శ్వేత మాట్లాడుతూ, దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతంలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ఏటా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 25 మంది పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అమరులయ్యారని గుర్తుచేశారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చా రు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీపీ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వచ్చే వారం కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డుల సమావేశం - ఈ అంశాలపైనే చర్చ!

తెలుగు రాష్ట్రాల నీటి అంశాలకు సంబంధించి వచ్చే వారం రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల భేటీల్లో పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాల వాటాకు సంబంధించి ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించిన పరస్పర ఫిర్యాదులు, పోలవరం, టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు సహా ఇతర అంశాలు బోర్డు సమావేశాల్లో ప్రస్తావనకు రానున్నాయి. ఈనెల 26న కేఆర్?ఎంబీ సమావేశం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించిన అంశాలు మరోమారు చర్చనీయాంశం కానున్నాయి. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగం, రాష్ట్రాల మధ్య నీటి వాటాలు, ప్రాజెక్టుల అనుమతులు, పరస్పర ఫిర్యాదులపై చర్చించేందుకు ఈ నెలలో రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 26వ తేదీన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, 30వ తేదీన గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అధికారులు, ఇంజనీర్లు పాల్గొననున్నారు. ఇప్పటికే పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశాల్లో జరిగే చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల సమావేశంలో కుదరని ఏకాభిప్రాయ. కృష్ణా నదీ జలాల పంపిణీ అంశం మరోసారి కేఆర్ఎంబీ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాలపై ఇటీవల జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలోనూ ఏకాభిప్రాయం కుదరలేదు. ఈనెల 26న జరిగే బోర్డు సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చ జరగనుంది. రెండు రాష్ట్రాలు తమ వాదనలను బలంగా వినిపించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటి వరకు 66, 34 నిష్పత్తిలోనే పంపకాలు జరగాలని ఏపీ అంటోంది. తెలంగాణ మాత్రం విభేదిస్తోంది. కృష్ణా బేసిన్ అధికంగా ఉన్నందున అందుకు అనుగుణంగా కేటాయింపులు జరగాలని అంటోంది. 70, 30 నిష్పత్తిన కృష్ణా జలాలు వినియోగించుకోవాలని తెలంగాణ కోరుతోంది. రెండు రాష్ట్రాల భిన్న వాదనల నేపథ్యంలో కేఆర్ఎంబీ సమావేశంలో జరగనున్న చర్చ కీలకం కానుంది. ఆ అంశాలపై చర్చ జరిగే అవకాశంఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో కొద్దిపాటి ప్రవాహాల నేపథ్యంలో నీటి నిర్వహణ కీలకంగా మారింది. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉన్న జలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ జలాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని త్రిసభ్య కమిటీ సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలు, నీటి విడుదలకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరిగే అవకాశం ఉంది. సాగునీటి అవసరాలతోపాటు పట్టణాలు, గ్రామాల తాగునీటి అవసరాలను సమన్వయం చేసుకోవడం కూడా కీలకంగా మారింది. రెండు రాష్ట్రాల నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తి అంశాలపై పరస్పరం అభ్యంతరాలు ఉన్నాయి.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

ఇండియా కూటమి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం

హైదరాబాద్ : ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందన్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్ న్యాయవ్యవస్థ, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నారని ఆరోపణ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు సభలు, సమావేశాలురాహుల్ గాంధీ అధికార దాహంతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శ కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి కలిసి దేశవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తూ, నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా వారి చర్యలు ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ ప్రయోజనాల కంటే అధికారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. నిరసనల ముసుగులో చట్టాలను ఉల్లంఘించడం, నిరాధార ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, అశాంతి సృష్టించేందుకు విదేశీ నిధులు కూడా వస్తున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందని, ఎలాంటి ఆధారాలు లేకుండా లక్షలాది మంది ఓటర్లను జాబితాలో చేర్చాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చేలా యాత్రలు నిర్వహించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ఇండియా కూటమి అసత్య కథనాలను తిప్పికొట్టేందుకు బీజేపీ దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించన న్నట్లు లక్ష్మణ్ ప్రకటించారు. అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు, మేధావులు-విద్యావం తులతో చర్చాగోష్టులు, ప్రతి అసెంబ్లీ నియో జకవర్గంలో 200 మందితో సమావే శాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. దేశ భద్రత, అర్హులైన ఓటర్ల హక్కుల విషయం లో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియ, రికాదన్నారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చేలా యాత్రలు నిర్వహించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ఇండియా కూటమి అసత్య కథనాలను తిప్పికొట్టేందుకు బీజేపీ దేశవ్యా ప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించన ప్రతిపక్షాల నిరసనలపై రాజకీయ వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో లక్ష్మణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ, ఎన్నికల సమగ్రత గురించిన ఆందోళనలను తెలియజేయడానికే తమ చర్యలని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

మంచిర్యాలలో మళ్ళీ రాజుకున్న విభేదాలు.. ఎమ్మెల్యే అనుచరుడిపై దాడి



మంచిర్యాల జిల్లా : మంచిర్యాల జిల్లా లో రాజకీయ వర్గపోరు మరోసారి భగ్గుమంది. దండేపల్లి మండలం తల్లాపేట గ్రామంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అనుచరుడిపై ప్రత్యర్థి వర్గం దాడికి పాల్పడింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే వర్గీయుడైన ఆకుల దుర్గప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే, తల్లాపేటలో ఆకుల దుర్గప్రసాద్‌పై ప్రత్యర్థులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను హుటాహుటిన చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకున్నారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం భారీగా పోలీసు బలగాలను మోహరించారు. కాగా, అక్టోబర్ 18న బతుకమ్మ వేడుకల సందర్భంగా కూడా ఇదే గ్రామంలో ప్రేమ్ సాగర్ రావు వర్గానికి, ప్రత్యర్థి వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. గమనార్హం. పాత కక్షలే ఈ దాడికి కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యాపేటలో పేలుడు కలకలం.. గ్యాస్ సిలిండర్ లీకేజీతో భారీ నష్టం

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో దసరా పండుగ వేళ భారీ పేలుడు సంభవించింది. స్థానిక పీఎస్ఎస్ఆర్ సెంటర్ సమీపంలోని శ్రీసాయి సూపర్ మార్కెట్‌లో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలింది. ప్రమాద ధాటికి సూపర్ మార్కెట్ భవనం తీవ్రంగా ధ్వంసమైంది. గ్యాస్ లీకేజీ కారణంగానే సిలిండర్ పేలి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పేలుడు ధాటికి భారీ శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడి భయాందోళనలతో పరుగులు తీశారు. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల్లో ఆందోళనకర వాతావరణం నెలకొంది. ప్రమాదంలో తమకు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని సూపర్ మార్కెట్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో ఎవరికైనా గాయాలయ్యాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదని, పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి:

హైదరాబాద్ : హైదరాబాద్‌లో మూడు చోట్ల పోలీసుల దాడులు నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన సీపీ సజ్జనార్ జీవకారుణ్యమే నిజమైన భక్తి అని ప్రజలకు పిలుపు వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి దసరా పండుగ సందర్భంగా కొందరు స్వార్థపరులు బోనుల్లో బంధించిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'లకు హైదరాబాద్ నగర పోలీసులు విముక్తి కల్పించారు. పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, మొత్తం నాలుగు పాలపిట్టలను కాపాడినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. దసరా పండుగ నాడు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయాన్ని కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినా, కొందరు వాటిని పెడచెవిన పెట్టారు. లంగర్ హౌస్ బాపూ ఘాట్ వద్ద ఓ ఆలయం దగ్గర రెండు పాలపిట్టలను, ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద ఒకటి, మంగళ్‌హాట్ బాలాజీనగర్ ఆలయం సమీ పంలో మరో పాలపిట్టను బోను ల్లో బంధించి ఉంచారు. సమా చారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆయా ప్రాం తాల్లో దాడులు నిర్వహించారు. తీవ్ర యాతనకు గురవుతున్న నాలుగు పాలపిట్టలను స్వాధీన ం చేసుకుని, వాటిని కేబీఆర్ పార్క్ అటవీ శాఖ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులపై అటవీ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సజ్జనార్ తెలిపారు. "స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షినిపండుగ పేరుతో బంధించి, తిండి, నీరు లేకుండా హింసించడం ఎవరికీ మంచిది కాదు. బోనులోని పక్షి ఆర్తనాదాలతో శుభం ఎలా కనిపిస్తుంది? జీవుల పట్ల కరుణ చూపడమే నిజమైన భక్తి కానీ, ప్రకృతిని బంధించడం కాదు" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలను ఎవరూ ప్రోత్సహించవద్దని, వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే 18004255364, 9803338666 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకే ఐఫోన్ అమాయకుల నుంచి భారీగా నగదు కాజేసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

హైదరాబాద్: ఎవరైనా మోసపోతే ఏం చేస్తారు? మళ్లీ అలా జరగకుండా జాగ్రత్త పడతారు. కానీ అతను మాత్రం అలా కాదు. తాను మోసపోయిన అనుభవంతోనే ఏకంగా పదుల సంఖ్యలో అమాయకులను బురిడీ కొట్టించాడు. బీటెక్ చదువుకున్న ఆ యువకుడు ఎక్కడికీ వెళకుండా, ఎంచక్కా ఇంట్లోనే కూర్చుని మోసాలకు తెరలేపాడు. ఓఎల్ఎక్స్‌లో ఖరీదైన స్మార్ట్ ఫోన్ కొందామనుకున్న వారి ఆశలను క్యాష్ చేసుకున్నాడు. ఇంతకీ ఎవరా మోసగాడు? ఓఎల్ఎక్స్ వేదికగా వల పన్ని కొనుగోలుదారులు, అమ్మకందారులను ఎలా బురిడీ కొట్టించాడు? అసలు ఇంట్లో నుంచి బయటకు రాకుండానే మోసాలు ఎలా చేశాడు? తక్కువ ధరకు ఖరీదైన ఫోన్లు అమ్ముతానని బురిడీ ఓఎల్ఎక్స్ ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకు ఖరీదైన ఫోన్ వస్తుందని ఎవరైనా ఆశపడి ఫోన్ చేస్తే చాలు ఈ కేటుగాడు వల విసురుతాడు. ఫోన్ కొనే వ్యక్తిని ఓ చోటికి రప్పించి నిజంగా ఫోన్ అమ్మే మరో వ్యక్తిని అక్కడికే పంపిస్తాడు. తీరా అక్కడ మొబైల్ చూసుకుని, అంతా బాగుందని ఆన్‌లైన్‌లో డబ్బులు పంపగానే అసలు ట్విస్ట్ ఇస్తాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. ఫోన్ తెచ్చిన వ్యక్తేమో తనకు డబ్బులు రాలేదంటూ గొడవకు దిగుతాడు. కాసేపటికి కానీ ఆ ఇద్దరికీ తాము మోసపో యామన్న నిజం అర్థం కాదు. అచ్చం ఇలాంటి స్కెచ్‌లు వేసి ఏకంగా 16 సార్లు మోసం చేశాడు. గతంలో ఓఎల్ఎక్స్ వేదికలో మోసపోయిన శ్రీరామ్‌వరంగల్ వాగ్దేవి కాలేజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన శ్రీరామ్ కొన్నాళ్ల పాటు అయ్యప్ప సొసైటీలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. అయితే గతంలో ఓఎల్?ఎక్స్?లో ఒక వస్తువు కొనబోయి ఓ సైబర్ నేరగాడి చేతిలో ఇతను మోసపోయాడు. తాను నష్టపోయిన డబ్బును అదే ఓఎల్ఎక్స్ వేదికగా రాబట్టాలని డిసైడ్ అయ్యాడు. అఖిల్, మనోజ్ అనే మారు పేర్లతో చీటింగ్‌కు తెరలేపాడు. తాను ఏ విధంగా అయితే మోసపోయాడో, అచ్చం అదే విధంగా పక్కా స్కెచ్ వేసి మోసాలకు తెరలేపాడు. డబ్బులు వచ్చాక ఫోన్ స్విచ్ఛాఫ్‌శ్రీరామ్ మోసం చేసే విధానం చాలా సింపుల్‌గా ఉంటుంది. గూగుల్ నుంచి ఖరీదైన ఐఫోన్లు, శామ్‌సంగ్ ఫోన్ల ఫోటోలు డౌన్లోడ్ చేసి ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకు అమ్ముతానని యాడ్స్ పెడతాడు. ఎవరైనా కొనేందుకు ఫోన్ చేస్తే కేవలం మధ్యవర్తినని, ఫోన్ అమ్మేది తన సోదరుడని నమ్మిస్తాడు. ఆ తర్వాత నిజంగా ఫోన్ అమ్మే వ్యక్తిని, కొనాలనుకునే వ్యక్తిని ఇద్దరినీ ఒకే చోటికి రప్పిస్తాడు. వాళ్లు ఫోన్ చెక్ చేసుకున్నాక, డబ్బులు మాత్రం తన క్యూఆర్ కోడ్‌కు సెండ్ చేయించుకుంటాడు. ఆ తర్వాత తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుంటాడు. నిందితుడు శ్రీరామ్ ఓఎల్ఎక్స్ ప్రొఫైల్‌లో ఐఫోన్ తక్కువ ధరకే అమ్ముతామని మోసం చేసేవాడు. మొత్తం నాలుగు కమిషనరేట్?లో 4 కేసులు నమోదయ్యాయి. అతడిని మొదటిసారిగా అరెస్టు చేశాం. రిమాండ్‌కు తరలించడం జరుగుతంది. ప్రజలు ఓఎల్ఎక్స్‌లో ఏదైనా కొనుగోలు చేసే ముందు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్‌లో జింక మాంసం కలకలం.. ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్, అక్టోబర్ 20: కర్ణాటక అడవుల్లో జింకలను వేటాడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు వ్యక్తులను మలక్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. వాహన తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా కనిపించిన కార్లను తనిఖీ చేయగా, నిందితుల వద్ద జింక మాంసం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. జింకలను వేటాడేందుకు నిందితులు కర్ణాటక అడవులకు వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వన్యప్రాణుల వేటకు సంబంధించి నిందితుల పాత్ర, వేట జరిగిన ప్రదేశం, ఇతర వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వాహన తనిఖీల సందర్భంగా జింక మాంసం బయటపడటంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. వన్యప్రాణుల వేటకు పాల్పడటం చట్టరీత్యా నేరం కావడంతో పోలీసులు కేసును తీవ్రంగా పరిగణిస్తున్నారు. అరెస్టైన ముగ్గురు నిందితుల నుంచి పోలీసులు తుపాకీ, ఎనిమిది బుల్లెట్లు, నైట్ విజన్ టెలిస్కోప్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అడవుల్లో జంతువుల కదలికలను గుర్తించేందుకు నైట్ విజన్ పరికరాలను ఉపయోగించారా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. నిందితుల వద్ద ఆయుధాలు, మందుగుండు సామగ్రి లభించడంతో ఈ వేట వ్యవహారంలో మరికొంరి ప్రమేయం ఉందా అనే అంశంపైనా దృష్టి సారించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను పరిశీలిస్తూ.. నిందితులు ఎక్కడి నుంచి జింక మాంసాన్ని తీసుకొచ్చారు, వేటలో ఉపయోగించిన ఆయుధాలకు సంబంధించిన అనుమతులు ఉన్నాయా అనే వివరాలను సేకరిస్తున్నారు.

డిస్కంలకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్: తెలంగాణ డిస్కంలు ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లకు గత బకాయిల అంశంలో హైకోర్టులో బుధవారం తాత్కాలిక ఊరట లభించింది. తెలంగాణ డిస్కంల నుంచి రూ.24 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంటూ ఏపీలోని ల్యాంకో కొండపల్లి పవర్ లిమిటెడ్.. కేంద్ర విద్యుత్ శాఖ ఆధ్వర్యంలోని 'ప్రాప్తి' పోర్టల్‌లో ఇన్వాయిస్‌లు నమోదు చేసింది. డిస్కంల వినతి మేరకు ఈ ఇన్వాయిస్‌ల అమలుపై హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 28కి వాయిదా వేసింది.

నగదును క్రిప్టో కరెన్సీగా మార్చి ఇస్తామంటే నమ్మకండి

హైదరాబాద్ : నగదును క్రిప్టో కరెన్సీ కింద మార్చుకోవాలనుకునే వారి వద్ద నుంచి దోపిడీ చేయాలని 8 మంది సభ్యుల ముఠా పథకం రచించింది. అయితే ముఠాకు చెందిన మహిళ మిగతా వారిని ఫోన్‌లో ముందుగా సంప్రదించి దోపిడీ ఎలా చేయాలో వివరించింది. ఈ క్రమంలో విజ్ఞేష్? అనే వ్యక్తిని నిందితుల్లో హమీద్?కు ఫోన్ ద్వారా పరిచయం చేసింది. పథకం గురించి వారంతా చర్చించారు. ఈ క్రమంలో నగదును క్రిప్టో కరెన్సీగా మార్చుకోవాలని చూస్తున్న అమరేంద్ర అనే వ్యక్తి విజ్ఞేష్‌కు పరిచయమయ్యాడు. నిందితులు తాము సులభంగా నగదును క్రిప్టో కరెన్సీ కింద మారుస్తామని అతన్ని నమ్మించారు. వారి మాటలు నమ్మిన అమరేంద్ర అతని ముగ్గురు స్నేహితులు ముఠా విసిరిన వలకు చిక్కారు. తన వద్ద ఉన్న రూ.25 లక్షలను క్రిప్టోకు మార్చుకోవడానికి అమరేంద్ర సిద్ధపడ్డాడు. ఇందుకోసం ముఠా ముందుగా ఎంచుకున్న ఓ కార్యాలయానికి బాధితులు రావాలని పిలిపించారు. కేవలం అమరేంద్ర అతనితో పాటు మరో ఇద్దరు మాత్రమే అక్కడికి రావాలని చెప్పారు. ఇందుకు ఒప్పుకున్న అమరేంద్ర నిందితులు సూచించిన బజార్‌ఘాట్‌లోని ఓ కార్యాలయానికి చేరుకున్నారు. ముఠాలోని ఓ వ్యక్తి ఆ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 11 ఆదివారం కావడంతో అక్కడ ఎవరూ లేకపోవడంతో అక్కడే వారు తమ పథకం అమలు చేయాలని భావించి బాధితులను పథకం ప్రకారం ఒక చోటకు చేర్చారు. బాధితులను మాటల్లో పెట్టిన ముఠా ఒక్కసారిగా తమ వద్ద ఉన్న పెప్పర్ స్ప్రే బాధితుల కళ్లలో చల్లారు. వారిని కింద తోసివేసి వెంట తెచ్చిన రూ.25 లక్షల బ్యాగ్‌ను తీసుకుని పరారయ్యాడు. ముఠా సభ్యులంతా పాతబస్తీ మీరాలం చెరువు వద్దకు చేరుకుని నగదు మొత్తం అంతా కలిసి పంచుకుని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుల ఫోన్ కాల్స్‌ను ట్రేస్ చేయడంతో ఇతర సాంకేతిక ఆధారాలతో మొత్తం 5 మందిని అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరైన సయ్యద్ అజాజ్?పై మెహదీపట్నం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్నాడు. అతనిపై 8 కేసులుండగా వీటిలో మూడు హత్య కేసులు. మరో నిందితుడు జకారియాపై అత్తాపూర్ ఠాణాలో రౌడీషీట్ ఉంది. గ్యాంగ్?లో సయ్యద్, జకారియాతో పాటు సుమైర్ ఖాన్, గుగ్లోత్ విజేష్ కుమార్, ఎండీ ఫరాజ్ హుస్సేన్లను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.11.50 లక్షలతో పాటు 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. "నగదును క్రిప్టో కరెన్సీ కింద మార్చుకోవాలనుకున్నారు. రూ.25 లక్షలను క్రిప్టోకు మార్చుకోవడానికి అమరేంద్ర భావించాడు. క్రిప్టో కరెన్సీగా మారుస్తామన్న వ్యక్తులు రూ.25 లక్షల బ్యాగ్‌ను తీసుకుని పరారయ్యారు. ఈ దొంగతనంలో 8 మంది ఉన్నారు. ముఠాలోని అయిదుగురిని అరెస్టు చేశాం" – శిల్పవల్లి, ఖైరతాబాద్? డీసీపీపరారీలో ఉన్న మహిళతో పాటు హమీద్, ఫైజల్ కోసం పోలీసులు గాలిస్తున్నామని డీసీపీ శిల్పవల్లి తెలిపారు. అపరిచితులు ఏది చెప్పినా నమ్మవద్దని సూచిస్తున్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే పోలీసులు ఫిర్యాదు చేయాలన్నారు.